# అభివృద్ధిని చూసి ఆదరించాలి

- అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- యువత శక్తివంచన లేకుండా కృషిచేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు
- రాజనగరంలో చండీహోమం నిర్వహించి మంత్రి దంపతులు



చండీహోమం నిర్వహిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దంపతులు

వనపర్తి టౌన్, అక్టోబర్ 14 : అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని, ప్రజలు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రి సమక్షంలో శనివారం జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ కాలనీకి చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. రాయిగడ్డకు చెందిన తోట మహేశ్ ఆధ్వర్యంలో 30మంది యువకులు చేరగా, వీరికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువత బీఆర్‌ఎస్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అభివృద్ధి పనులను తమ వార్డుల్లో, కాలనీల్లో వివరించి ఓట్లను అభ్యర్థించాలని, అందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. 60ఏండ్లలో చేపట్టని అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో కేవలం పదేండ్లలోనే చేసి చూపించామన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ఇక్కడ అమలు చేసే సంక్షేమ పథకాలను కేంద్రం కాపీ కొడుతున్నదని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి మీకు సేవ చేస్తానని మంత్రి వెల్లడించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో రాజు, మహేశ్, రవి, చందు, నరేశ్, బాలకృష్ణ, రాము, శివాజీ, రాణాతోపాటు 30మంది యువకులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, జోహెబ్, బొడ్డు శ్రీను తదితరులు ఉన్నారు.

**చండీహోమం నిర్వహించిన మంత్రి దంపతులు..**

వనపర్తి టౌన్, అక్టోబర్ 14 : జిల్లా కేంద్రంలోని రాజనగరం రామకేశ్వర ఆలయంలో శనివారం వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చండీహోమం నిర్వహించారు. ఆలయంలో గణపతి, సుబ్రమణ్యం, రాహు కేతువులు, శనేశ్వరం, ఈశ్వరుని ఆలయాల్లో అభిషేకాలు చేశారు. రుత్వికిరణ దీక్షను స్వీకరించారు. మహారుద్ర చండీహోమాన్ని మంత్రి దంపతులు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు మంత్రి చెప్పారు. గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తియాదవ్, కౌన్సిలర్ నాగన్నయాదవ్, విజయ్‌యాదవ్ దంపతులు చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు వేదపండితులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంలో పండితులు సాయికుమార్‌శర్మ, శ్రావణ్‌కుమార్, శివరామశర్మ, మధుఆచారి, శ్రీనివాసశర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ విజయ్, పురుషోత్తంరెడ్డి, మాణిక్యం, ఆవుల రమేశ్, నరసింహా, గిరి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్, మహిళలు

## అంగరంగ వైభవంగా..

వనపర్తి టౌన్, అక్టోబర్ 14 : జిల్లా కేంద్రంలోని జంగిడిపురం భగీరథ కాలనీలో దేవిశరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఈ వేడుకలను మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ప్రారంభించారు. మహిళలు రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను చేసి ఆడిపాడారు. ఎంగిలిపూల బతుకమ్మను తయారు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు హేమలత, మాదవి, అనురాధ, మణెమ్మ, నాగలక్ష్మి, శాంత, స్వప్న, పావని, మాదవి, అలివేల, దేవసేన, నాగవేణి, భగీరథ కాలనీ మహిళలు విజిత, అశ్విని, నాగమణి, రాములమ్మ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.





నాడు
నేడు





నాడు తాగునీటి కోసం కిలోమీటర్ల మేర వాగులు, వ్యవసాయ బావులకు ప్రజలు ఎడ్లబండ్లపై డ్రమ్ములు కట్టుకొని, నీళ్ల బిందెలను తీసుకొని వెళ్లేవారు. పక్కనే కృష్ణమ్మ పారుతున్నా ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ప్రజల దహార్తిని తీర్చలేకపోయారు. ప్రజల కష్టాలు చూసి చలించిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రజల గోస తీర్చేందుకు భగీరథ నీటిని నట్టింటికి తీసుకొచ్చారు. ఇంటి వద్దే నీళ్లు వస్తుండడంతో వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం కనిపెట్ట గ్రామ మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

- యాదిరెడ్డి, నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, వనపర్తి

## విదేశీయులను ఆకర్షిస్తున్న పాలమూరు

- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- విదేశీ మహిళలతో కలిసి బైక్‌రైడింగ్
- రాష్ట్రంలో 9 రోజులపాటు పర్యటన



మహబూబ్‌నగర్‌లోని హ్యాండ్ ఫౌంటేన్ వద్ద విదేశీయులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 14 : ఒకప్పుడు తాగునీటి కోసం అవస్థలు పడిన మహబూబ్‌నగర్.. నేడు విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షిస్తున్నదని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ సహకారంతో మహబూబ్‌నగర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దడం వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. ఫ్రెంచ్ మోటర్ సైక్లిస్ట్ ఆలిసన్ గ్రున్ ఆధ్వర్యంలోని ఫ్రీ డబ్ల్యూ వేదిక ద్వారా ఫ్రాన్స్, అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, సింగపూర్, థా యిలాండ్‌కు చెందిన 8 మంది విదేశీ బైక్‌రైడర్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న యాత్రను జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. అనంత రం వారితోపాటు బైక్ రైడింగ్ చేశారు. బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హ్యాండ్ ఫౌంటేన్ కూడలి వద్ద ఫొటో దిగారు.



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న శేరిపల్లి గ్రామస్తులు

## ఎమ్మెల్యే ‘ఆల’ వెంటే మేమంతా..

- మూకుమ్మడిగా తీర్మానం చేసిన శేరిపల్లి గ్రామస్తులు

భూత్పూర్, అక్టోబర్ 14 : ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వెంటే ఉంటామని మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు మూకుమ్మడిగా తీర్మానం చేశారు. కారు గుర్తుకే ఓటేస్తామని ఏకగ్రీవంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలోని అన్ని కులాలకు చెందిన నాయకులు సర్పంచ్ బోల శేఖర్, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్రాములు ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ సమక్షంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ తమ గ్రామంలో 30–40 ఏండ్ల కిందట ఫ్యాక్షన్ రాజకీయాలు ఉండేవన్నారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామ రూపురేఖలు మారాయన్నారు. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి రూ.20 లక్షలతో జీపీ భవనం మంజూరు చేశారన్నారు. జాతీయ రహదారి నుంచి శేరిపల్లి మీదుగా హస్నాపూర్‌కు రూ.2.75 కోట్లతో బీటీ రోడ్డును మంజూరు చేయగా, పనులు పూర్తయ్యాయన్నారు. అదేవిధంగా గ్రామంలో రూ.35 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, చేపల కోసం రూ.25 లక్షలతో చెరువులో పూడిక తీశారని చెప్పారు. మత్స్యకారుల భవనం కోసం రూ.15లక్షలను మంజూరు చేయగా, పనులు జరుగుతున్నాయి. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా కృషి చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే ఓటేస్తామని చెప్పారు.

## ఆత్మకూరు వాసికి ‘జర్మనీ’ డాక్టరేట్



రవిశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 14 : జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయం నుంచి ఆత్మకూరు వాసి డాక్టరేట్ అందుకున్నారు. పట్టణానికి చెందిన పీవీ.రవిశేఖర్‌రెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ (అంతర్జాతీయ శాంతి) అంశంలో సామాజికంగా చేసిన సేవకుగానూ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కరోనా సమయంలో నిరుపేదలకు అన్నదానం, ఇంటింటికీ బ్లీచింగ్, పారిశుధ్య చర్యలు, మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి కార్యక్రమాలను గుర్తించి విశ్వవిద్యాలయం వారు ఇంటర్నేషనల్ పీస్‌గా గుర్తించి డాక్టరేట్‌ను ప్రకటించారు. పాండిచ్చేరిలోని పల్లడం రోడ్ ఇండోర్ స్టేడియంలో ప్రముఖ సంఘ సంస్కర్త రోహిణీ దీక్షిత్ చేతులమీదుగా రవిశేఖర్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు.